సాక్షి విశాఖపట్నం

గురువారం। 25। సెప్టెంబర్। 2025



స్టేషన్‌లోనే వసూళ్లు!



- ఫిర్యాదు చేసినా కేసు పెట్టకుండా కాలయాపన
- నేరుగా స్టేషన్‌లోనే రూ.2 లక్షలు తీసుకున్నట్లు సీసీ ఫుటేజీ
- అనకాపల్లి టౌన్ సీఐకి బిగుస్తున్న ఉచ్చు!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి ప్రభుత్వంలో పోలీస్ స్టేషన్లు ఏకంగా వసూళ్లకు కేంద్రంగా మారిపోతున్నాయా? అక్కడ ఇక్కడ ఎందుకంటూ నేరుగా స్టేషన్‌లోనే లంచాలు వసూలు చేస్తున్నారా? అంటే.. గత నెలలో అనకాపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిన వ్యవహారాన్ని గమనిస్తే ఇట్టే తెలుస్తోంది. బాధితుడి నుంచి ఫిర్యాదు అందినప్పటికీ కేసు నమోదు చేయకుండా ఏకంగా అనకాపల్లి స్టేషన్‌లోనే రూ.2 లక్షలు వసూలు చేసిన వ్యవహారం సీసీ ఫుటేజీ సాక్షిగా బయటపడినట్లు సమాచారం. నేరుగా స్టేషన్‌కే వచ్చి రూ.2 లక్షలు అందజేసినట్టు ఏసీబీని ఆశ్రయించిన పెందుర్తి వ్యాపారి స్పష్టం చేయడంతోపాటు స్టేషన్ సీసీ ఫుటేజీలో కూడా అదే దృశ్యం కనిపించినట్లు తెలుస్తోంది. ఈ రూ.2 లక్షలు ఎస్ఐ తీసుకున్నప్పటికీ అంతిమంగా ఎవరి జేబులోకి వెళ్లాయనే కోణంలో ఏసీబీ దృష్టి సారించినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో 'విజయ'వంతంగా జేబులోకి వేసుకున్న వ్యక్తిని కూడా నిందితుడిగా ఏసీబీ చేర్చనున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా ఫిర్యాదు అందినప్పుడు కేసు నమోదు చేయకుండా ఉద్దేశపూర్వకంగా నాన్చుడు ధోరణి అవలంబించిన అనకాపల్లి సీఐ పేరును కూడా కేసులో ఏసీబీ చేర్చనున్నట్లు సమాచారం. స్టేషన్‌లోనే లంచాలు తీసుకుంటున్న సీసీ ఫుటేజీ లభించడంతో ఇప్పుడు ఏ చర్యలు తీసుకుంటారనేది తేలాల్సి ఉంది. అయితే ఈ వ్యవహారంలో అసలు దోషి తప్పించుకుంటున్నారంటూ ఆగస్టు 17వ తేదీన 'సాక్షి'లో 'అసలు దోషి ఎవరు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇప్పుడు ఏసీబీ తాజా విచారణలో అసలు దోషి బయటపడే అవకాశం ఉన్నట్టు స్పష్టమవుతోంది.



సాక్షి

అసలు దోషి ఎవరు?

'అసలు దోషి ఎవరు' అంటూ ఆగస్టు 17న 'సాక్షి' కథనం

ఎవరి జేబులోకి రూ.2 లక్షలు..!

పెందుర్తికి చెందిన బంగారు వ్యాపారి అప్పారావు అనకాపల్లిలో ఖాళీగా ఉన్న తన షాపును ఈ ఏడాది మే నెలలో శాస్తి మండల్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చి రూ.రెండు లక్షలు అడ్వాన్స్ తీసుకున్నాడు. శాస్తి మండల్ జూలై 16న తన అద్దె షాపు నుంచి పక్కనే ఉన్న బంగారు దుకాణంలోకి రంధ్రం తవ్వి బంగారు ఆభరణాలను దొంగలించడానికి ప్రయత్నించి, విఫలం కావడంతో పరారయ్యాడు. పక్క షాపు యజమాని బుద్ధ శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఈశ్వరరావు షాపు యజమాని అప్పారావును పిలిపించి విచారించారు. ఈ కేసులో ఇరికించకుండా అడ్వాన్స్‌గా తీసుకున్న రూ.2 లక్షలు, షాపు తాళాలు ఇవ్వడానికి లక్ష రూపాయలు ఎస్ఐ డిమాండ్ చేశాడు. అతడు అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.50 వేలకు తగ్గించారు. దీంతో అతడు ఏసీబీని ఆశ్రయించగా ఆగస్టు 14వ తేదీన ఎస్ఐ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అయితే నేరుగా స్టేషన్‌లోనే రూ.2 లక్షలు ఎస్ఐకి అందజేసినట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే ఫిర్యాదు వచ్చినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా స్టేషన్ హౌస్ ఆఫీసర్ అయిన సీఐ మిన్నకుండిపోవడం బట్టి చూస్తే వ్యవహారమంతా ఆయనకు తెలిసే జరిగిందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఐపై కూడా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఎస్ఐని ఇరికించి..!

వాస్తవానికి సదరు స్టేషన్‌లో అన్ని వ్యవహారాలు నడిపిస్తున్న వ్యక్తి.. ఎస్ఐని పావుగా వాడుకుంటున్నట్టు మొదటి నుంచీ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రిన్సిపల్ ఎస్ఐవి నువ్వేనంటూ వసూళ్లకు దింపినట్టు కూడా అనకాపల్లి పోలీసు వర్గాల్లో చర్చ జరిగింది. గతంలో ఇదే ప్రాంతంలో పనిచేసిన సమయంలో ఒక భూమి విషయంలో తలదూర్చడంతో ఫిర్యాదులు ఎదుర్కొన్న సదరు వ్యక్తినే ఈ లంచాల అవతారంలో కూడా కీలక సూత్రధారిగా విమర్శలు వినిపించాయి. అయితే, అత్యంత తెలివిగా నేరుగా రంగంలోకి దిగకుండా ఎవరినో ఒకరిని ముందుకుపెట్టి కథ నడిపిస్తూ విజయవంతంగా ముందుకెళుతున్నారనే పేరు ఉంది. ఈ అవినీతి కథలో మొత్తంగా వసూలు చేసిన రూ.2 లక్షలు ముందుగానే స్టేషన్‌లోనే అప్పగించినట్టు ఫిర్యాదుదారుడు ఏసీబీకి తెలిపాడు. అయితే రూ.2 లక్షలు ఎవరి జేబులోకి వెళ్లాయనే కోణంలో ఇప్పుడు విచారణ జరుగుతున్నట్టు సమాచారం. గత ఏడేనిమిదేళ్లుగా అనకాపల్లి ప్రాంతంలోనే ఎస్ఐ దాసరి ఈశ్వరరావు విధులు నిర్వర్తిస్తున్నారు. కశింకోట, అనకాపల్లి రూరల్, సీసీఎస్ తదితర పోస్టింగులు నిర్వర్తించారు. గత ఏడాది కాలంగా అనకాపల్లి టౌన్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ తరహా అవినీతి ఆరోపణలు లేవనే పేరు డిపార్టుమెంటులో ఉంది. ప్రధానంగా టౌన్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత ఈ వసూళ్ల ఆరోపణలు మొదలైనట్టు తెలుస్తోంది. అన్ని వ్యవహారాల్లోనూ సదరు ఎస్ఐ ఈశ్వరరావును ముందు పెట్టి వసూళ్లకు దింపి.. 'విజయ'వంతంగా వ్యవహారం నడిపింది ఎవరనేది ఏసీబీ ఆధారాలతో సహా తేల్చేపనిలో ఉన్నట్టు సమాచారం.

మేయర్‌కు స్మార్ట్ చెక్!

- తనకు తెలియకుండా హాస్టల్ భవనాలకు టెండర్లు పిలిచారంటూ ఆగ్రహం
- టెండర్ల రద్దు కోసం ఏకంగా కౌన్సిల్‌లో తీర్మానం
- జీవీఎస్‌సీసీఎల్ ద్వారానే టెండర్లు పిలిచేందుకు అనుమతి
- తాజాగా ఉత్తర్వులతో మేయర్ నిర్ణయాలకు బ్రేక్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో మేయర్ ప్రాభవానికి క్రమంగా చెక్ పడుతోందా? స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటమికి ఆయన వ్యవహారశైలే కారణమని టీడీడీ అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చిందా? ఎమ్మెల్యేలతో ఆయన వ్యవహారశైలిపై కూడా ఆగ్రహంగా ఉందా? అంటే.. తాజా పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానమే వస్తోంది. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పరిధిలో తనకు తెలియకుండా హాస్టల్ భవనాలకు టెండర్లను పిలవడంపై కార్పొరేషన్ మేనేజర్ ఆనంద్‌పై మేయర్ పీలా శ్రీనివాసరావు మండిపడ్డారు. అంతటితో ఆగకుండా ఆ టెండర్లను రద్దు చేస్తూ పాలకవర్గ సమావేశంలో నిర్ణయం కూడా తీసుకున్నారు. అయితే, మేయర్ ప్రయత్నాలను చిత్తుచేస్తూ.. గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ (జీవీఎస్‌సీసీఎల్) స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)గా కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు కూడా జారీచేశారు. అంతేకాకుండా జీవీఎస్‌సీసీఎల్ మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులతో పాటు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ ప్రాజెక్టు పనులను కూడా పర్యవేక్షిస్తుందని స్పష్టంగా పేర్కొన్నారు. తద్వారా మేయర్ నిర్ణయాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కమిషనర్‌కు వ్యతిరేకంగా..!

వాస్తవానికి జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్ గార్గ్ తనదైన ముద్రతో ముందుకెళుతున్నారు. కమిషనర్‌గా ఆయన వచ్చిన సందర్భంలో నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని వ్యతిరేకించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా అక్రమ నిర్మాణాలు, టీడీఆర్‌ల వ్యవహారాల్లోనూ కమిషనర్ సూటిగా వ్యవహరిస్తుండటం మేయర్ ఆగ్రహానికి కారణమన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో తనకు తెలియకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ కమిషనర్‌పై మేయర్ గుర్రుగా ఉన్నారు. ఈ విషయమై తన అనుయాయుల వద్ద ఆయన బయటపడిన సందర్భాలు ఉన్నట్టు జీవీఎంసీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణాలపై జీవీఎస్‌సీసీఎల్ ద్వారా సీఈవో హోదాలో టెండర్లను కమిషనర్ ఆహ్వానించారు. ఈ విషయం తనకు తెలియదంటూ మేయర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు టెండర్లను రద్దు చేస్తున్నట్టు కూడా పరోక్షంగా కొన్ని మీడియాల్లో కథనాల ద్వారా ప్రకటించారు. అంతేకాకుండా కమిషనర్ వైఖరితో మేయర్‌కు ఇబ్బందిగా మారుతోందంటూ లీకులిచ్చారు. తద్వారా కమిషనర్‌పై నేరుగా యుద్ధాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జీవీఎస్‌సీసీఎల్ టెండర్లను రద్దు చేయడమే కాకుండా ఏకంగా బీచ్‌రోడ్‌లోని సంస్థ కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. తనదే పైచేయి అన్నట్టుగా మేయర్ వ్యవహరించారు. తాజాగా ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులతో మేయర్‌కు 'స్మార్ట్'గా చెక్ పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మేయర్‌కే ముప్పు..!

కేవలం జీవీఎస్‌సీసీఎల్‌లోనే కాకుండా చికెన్ వ్యర్థాల విషయంలోనూ కమిషనర్‌పై నెపం పెట్టే ప్రయత్నం జరిగింది. చికెన్ వ్యర్థాల తరలింపులో పట్టుబడిన వారిపై కేసులు పెట్టకుండా కమిషనర్ అడ్డుపడుతున్నారంటూ మేయర్ వర్గం ప్రచారం చేసింది. వాస్తవానికి కేతన్‌గార్గ్ కమిషనర్‌గా వచ్చిన తర్వాత చికెన్ వ్యర్థాల తరలింపునకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి కాపులుప్పాడకు తరలించేలా చూస్తున్నారు. దీంతో ఈ ప్రచారం కాస్తా విఫలమైంది. అయితే ఏ టెండర్లను మేయర్ రద్దుచేశాడో... అవే టెండర్లను జీవీఎస్‌సీసీఎల్ ద్వారానే పిలిచేందుకు అనుమతిస్తూ తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మేయర్ పీఠానికి తాము ఇస్తున్న గౌరవం ఎంత మేర ఉందనే విషయాన్ని సూటిగా అర్థమయ్యేలా చెప్పినట్టు ఉందన్న అభిప్రాయం జీవీఎంసీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మొత్తంగా మేయర్ అధికారాలకు ముప్పు వచ్చేలా తాజా నిర్ణయం ఉందన్న అభిప్రాయం మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

అధినేతతో ఆత్మీయ భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్తలు తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితుల్ని, చేపడుతున్న కార్యక్రమాలు, చేస్తున్న పోరాటాలను వివరించారు.

డీఎస్పీ కారుకే ఫొటో తీస్తావా?

- నీ ఉద్యోగం తీయిస్తా
- కానిస్టేబుల్‌పై రెచ్చిపోయిన కారు డ్రైవర్

విశాఖ సిటీ: డీఎస్పీ కారుకే ఫొటో తీస్తావా? నీ ఉద్యోగం తీయిస్తా.. అంటూ ఓ కారు డ్రైవర్ కానిస్టేబుల్‌పై విరుచుకుపడ్డాడు. బుధవారం సంపత్ వినాయగర్ ఆలయం రోడ్డులో కారును నిలిపారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డుపైనే కారు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ముందుకు వెళ్లాలని కానిస్టేబుల్ సూచించాడు. అందుకు కారు డ్రైవర్ అంగీకరించలేదు. కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగాడు. దీంతో కానిస్టేబుల్ కారుకు ఫొటో తీశాడు. వెంటనే డ్రైవర్ రెచ్చిపోయాడు. డీఎస్పీ కారుకే ఫొటో తీస్తావా? అంటూ ఒంటికాలిపై లేచాడు. నీ ఉద్యోగం తీయిస్తా అంటూ హెచ్చరించడం గమనార్హం.



రోడ్డుపై ఆపిన కారు

'మహా' విస్తరణ

- జోన్ల వికేంద్రీకరణపై దృష్టి
- 8 నుంచి 10 జోన్లకు పెంపు
- కొత్తగా భీమిలి, గోపాలపట్నం జోన్లు
- రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్?

డాబాగార్డెన్స్: నగర జనాభా పెరుగుదల, సమీప గ్రామీణ ప్రాంతాల విలీనంతో ఒకప్పటి విశాఖ మున్సిపాలిటీ కార్పొరేషన్ అయ్యింది. కార్పొరేషన్ గ్రేటర్‌గా మారింది. 32 గ్రామాల విలీనంతో 72 వార్డులున్న జీవీఎంసీ 98 వార్డులు, 8 జోన్లకు చేరింది. ఇప్పుడు గ్రేటర్ కార్పొరేషన్ మరో అడుగు ముందుకేస్తోంది. కొన్ని గ్రామీణ ప్రాంతాల విలీనంతోపాటు, 8 జోన్లను కాస్తా.. 10 జోన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్లు తెలిసింది.

పరిధి పెరగనుంది

గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మరింత విస్తరించనుంది. కొత్త విశాఖ జిల్లాలో కొన్ని గ్రామీణ ప్రాంతాలు జీవీఎంసీలోకి వచ్చే అవకాశముంది. విశాఖ మొత్తాన్ని జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని పాలకవర్గం భావిస్తోంది. దీంతో జీవీఎంసీ విస్తీర్ణం పెరుగుతుండడంతో కొత్త జోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనను కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. దీనికి ప్రభుత్వం కూడా ఆమోద ముద్ర వేసినట్టు సమాచారం.

10 జోన్లకు పెంపు

జీవీఎంసీ విస్తీర్ణం పెరిగితే పరిపాలన, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కష్టతరంగా మారుతుంది. ఈ సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు జోన్ల సంఖ్యను పెంచాలని పాలకవర్గం భావించింది. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో 8 జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధి రెండు, మూడు నియోజకవర్గాలకు విస్తరించి ఉన్నాయి. అటువంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు ఇప్పుడు ఒక్కో నియోజకవర్గం పరిధిలో ఒక జోన్ మాత్రమే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జోన్ల వికేంద్రీకరణ పూర్తి చేశారు. ఒక నియోజకవర్గంలో ఉన్న వార్డులన్నీ ఒకే జోన్ పరిధిలోకి రానున్నాయి. అలాగే ఇప్పటి జోన్లుగా పిలిచే ఈ కార్యాలయాలు ఇకపై నియోజకవర్గ పేర్లతో ఏర్పాటు కానున్నాయి.

జీవీఎంసీలోకి మండలాలు..

ఉమ్మడి విశాఖ విభజన తర్వాత విశాఖ జిల్లాగా మారాక పద్మనాభం, ఆనందపురం, పెందుర్తిలో కొన్ని గ్రామాలు జీవీఎంసీకి దూరంగానే ఉన్నాయి. దీంతో ఆయా మండలాలకు జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. తాజాగా మొత్తం విశాఖ జిల్లా అంతటినీ జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబును ప్రజా ప్రతినిధులు విశాఖ పర్యటనలో కోరారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను సీఎం ఆదేశించారు. దీంతో ప్రస్తుతం మండలాలుగా ఉన్న ఆనందపురం, పద్మనాభం ప్రాంతాలను కూడా జీవీఎంసీ పరిధిలోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అలాగే పెందుర్తిలో కొంత మేర జీవీఎంసీలో ఉన్నప్పటికీ మెజార్టీ విస్తీర్ణంలో ఇంకా అనేక గ్రామాలున్నాయి. వీటిని కూడా జీవీఎంసీ పరిధిలోకి తీసుకురానున్నారు. దీంతో జీవీఎంసీ విస్తీర్ణం భారీగా పెరగనుంది.



దీని ప్రకారం విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, పెందుర్తి, గాజువాక, భీమిలి, అనకాపల్లి పేర్లతో జోన్లు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు కొత్తగా మరో రెండు జోన్లు ఏర్పాటు చేయనున్నారు. పెందుర్తిలో గ్రామీణ ప్రాంతాలు కలిస్తే పరిధి పెరుగుతుంది. దీంతో గోపాలపట్నం జోన్ కొత్తగా రానుంది. అలాగే ఆనందపురం, పద్మనాభం మండలాలు కలిస్తే ప్రస్తుతమున్న మధురవాడ జోన్ పరిధి భారీగా పెరగనుంది. దీంతో కొత్తగా భీమిలి జోన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 8 జోన్లు 10కి పెరగనున్నాయని సమాచారం. ఇప్పటికే ఈ ప్రతిపాదనలను పాలకవర్గం ప్రభుత్వానికి పంపింది. దీనిపై ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించింది. ఈ జోన్ల పెంపునకు ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. త్వరలోనే తుది ప్రక్రియకు కసరత్తు జరగనున్నట్లు జీవీఎంసీలో చర్చ జరుగుతోంది.

పరిపాలన సౌలభ్యం.. పారదర్శకత

జీవీఎంసీ పరిపాలనలో అనూహ్య మార్పులు రానున్నాయి. పరిపాలన సౌలభ్యం, పారదర్శకతలో భాగంగా ఈ ప్రక్రియను గత కౌన్సిల్ సమావేశంలో శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఒక్కో జోన్ పరిధిలో 8 నుంచి 15 వార్డులు వరకు ఉన్నాయి. ఒక జోన్ పరిధిలో రెండు, మూడు నియోజకవర్గాలకు సంబంధించి ప్రాంతాలున్నాయి. దీంతో పరిపాలన సక్రమంగా ఉండడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని మార్చాలని దీర్ఘకాలిక డిమాండ్ ఉంది. ఒక్కో నియోజకవర్గాన్ని ఒక జోన్‌గా చేయడం ద్వారా పరిపాలన సులభతరం అవుతుందని భావిస్తున్నారు.

యూత్ జోష్







ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది వేడుకల్లో భాగంగా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్ అంగరంగ వైభవంగా జరిగింది. ర్యాలీ సాంతం కేరింతలు, తమ రాష్ట్రానికే పరిమితమైన నృత్యాలతో అంబరాన్నంటేలా సంబరాలు చేశారు. ఫెస్టివల్ ర్యాలీలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ ప్రాంతీయ వస్త్ర ధారణతో ఆకట్టుకున్నారు. విద్యార్థులతో కలిసిన అధ్యాపకులు, ఆచార్యులు కూడా తమ వయసుకు యువరక్తాన్ని దట్టించి మరీ సందడిని రెట్టింపు చేశారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జీవీఎంసీ సమస్యలపై ఎమ్మెల్యేల ఏకరువు

విలీన గ్రామాల్లో పనులు జరగడం లేదని ఆవేదన

సాక్షి, అమరావతి: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగుల కొరత వల్ల ఏ పనులూ జరగడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం శాసనసభ సమావేశాల్లో జీవీఎంసీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థలో సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఎవరేమన్నారంటే..

విలీన గ్రామాల్లో సదుపాయాల్లేవు

జీవీఎంసీలో చాలా గ్రామాలు విలీనమయ్యాయి. కానీ.. మౌలిక సదుపాయాలు లేవు. రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ కనెక్షన్లు అభివృద్ధి చేయాలి. జీవీఎంసీలో సిబ్బంది సమస్య ఉంది. ఒక్క అనకాపల్లి జోన్‌లోనే 300 ఖాళీలు ఉన్నాయి. ఎక్కడైనా డంపింగ్ యార్డు ఊరి చివరన ఉంటే ఇక్కడ మాత్రం మున్సిపల్ కార్యాలయంలోనే ఉంది. జోన్లను నియోజకవర్గ స్థాయిలో విభజించాలి. ప్రభుత్వం విశాఖపట్నంపై కూడా దృష్టి పెట్టాలి.

– కొణతాల రామకృష్ణ, అనకాపల్లి ఎమ్మెల్యే

మంత్రి పట్టించుకోవడం లేదు

కేంద్రం, జీవీఎంసీ నిధులతో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ముడసర్లోవ మీదుగా ఎండాడకు తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు రూ.595 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. టెండర్లు పిలవలేదు. 8 నెలలుగా మంత్రి చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. 2019–24లో టీడీఆర్ సర్టిఫికెట్ల కుంభకోణం జరిగింది. మంత్రిని అడిగితే విజిలెన్స్ కమిటీ వేశామన్నారు. అది ఎంతవరకు వచ్చింది. విశాఖకు ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులను ఇవ్వాలి.

– వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే

టీడీఆర్‌లు ఇవ్వడం లేదు

జీవీఎంసీలో నియోజకవర్గాల వారీగా జోనల్ వ్యవస్థ ఉండాలి. సింహాచలం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ కోసం ప్రైవేటు ఆస్తులు తీసుకున్నారు. రెండు చందనోత్సవాలు అయిపోయినా ఇప్పటికీ ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదు. భవిష్యత్‌లో చాలా ప్రతిపాదనలు ఉన్నాయి. టీడీఆర్ జారీలో జాప్యాన్ని నివారించాలి.

– గణబాబు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే

కమిటీ వేసి బాండ్లు ఇవ్వాలి

టీడీఆర్‌కు సంబంధించి అధికారులు నిర్ణయం తీసుకోకుండా ప్రత్యేక కమిటీ ద్వారా జారీ చేయాలి. మున్సిపల్, రెవెన్యూ, ఏపీఐఐసీ, ఇరిగేషన్ నుంచి సభ్యులు ఉండాలి. గాజువాక జోన్ కార్యాలయాన్ని పునర్నిర్మించాలి.

– పల్లా శ్రీనివాస్, గాజువాక ఎమ్మెల్యే

ఉద్యోగుల కొరత నిజమే

జీవీఎంసీలో జోన్ల వారీగా ఉద్యోగుల శాంక్షన్ స్ట్రెంత్ లేదు. ఉన్న మొత్తం సిబ్బందిని అవసరాన్ని బట్టి కమిషనర్ కేటాయిస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చేందుకు కేబినెట్‌లో పెట్టాం. ఇది పూర్తయితే ఏఈలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు భర్తీ అవుతాయి. గత ప్రభుత్వంలో జరిగిన పరిణామాలతో కమిషనర్లు టీడీఆర్ జారీచేసేందుకు భయపడుతున్నారు. త్వరలో అన్నీ పరిష్కారమవుతాయి. త్వరలోనే జోనల్ కమిషనర్లకు పవర్స్ ఇస్తాం. సింహాచలం టీడీఆర్ బాండ్ల జారీకి ఎండోమెంట్‌తో మాట్లాడుతున్నాం.

– పి.నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి

మేయర్‌కు నిరసన సెగ

పీలా ఇంటి ముందు చిరు వ్యాపారుల బైఠాయింపు



వ్యాపారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా

పెందుర్తి: ఆపరేషన్ లంగ్స్ పేరిట బడ్డీలను తొలగించడంపై చిరువ్యాపారులు కన్నెర్రజేశారు. దుకాణాల తొలగింపు బాధిత చిరు వ్యాపారులంతా పెందుర్తిలోని మేయర్ పీలా శ్రీనివాసరావు ఇంటి ముందు బైఠాయించారు. మేయర్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బయటకు వచ్చిన మేయర్ పీలా శ్రీనివాసరావు బాధితులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. దుకాణాలు తొలగించిన వారు ఆందోళన చెందవద్దని చెప్పారు. అర్హులైన పేదలను గుర్తించి వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని భరోసా ఇచ్చి వారిని అక్కడి నుంచి పంపించారు. కాగా మేయర్ ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

నిరంతర నైపుణ్యాల పెంపుతో వృత్తిలో రాణింపు

రెండు రోజుల నర్సింగ్ విద్యార్థుల రాష్ట్ర సదస్సు ప్రారంభం



ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న అతిథులు

ఏయూక్యాంపస్: నైపుణ్యాలతో మెరుగైన అవకాశాలు లభిస్తాయని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా 31వ ఎస్ఎన్ఏఐ ద్వైవార్షిక రాష్ట్ర సదస్సు–2025ను బుధవారం ఆయన ప్రారంభించారు. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ ప్రాంతీయ శాఖ 'లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో, ద జర్నీ ఆఫ్ ఏ నర్సింగ్ స్టూడెంట్' అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తోంది. ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిరంతరం నైపుణ్యాలను పెంచుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. విదేశాల్లో సైతం నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

ఇండియన్ రెసిటేషన్ ఫెడరేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు మాట్లాడుతూ ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంలో, సార్వత్రిక రోగ నిరోధకత కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షురాలు(సౌత్) డాక్టర్ బి.వల్లి మాట్లాడుతూ నిరంతరం నేర్చుకోవాలనే తపనతోనే వృత్తిలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. టీఎన్ఏఐ ఏపీ శాఖ అధ్యక్షురాలు సీఆర్ సంషీర్ బేగం, టీఎన్ఏఐ ఏపీ శాఖ కార్యదర్శి, ఏపీ ఎన్ఎంసీ రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను మెరుగుపరచుకుంటూ, సమష్టిగా పనిచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఏపీ నర్సింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ ప్రత్యక్ష జ్ఞానాన్ని, సామర్థ్యాలను పెంచుకోవడానికి నర్సింగ్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. సంస్థ సలహాదారు డాక్టర్ ఎం.సత్యవల్లి, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్‌పర్సన్ ప్రీతం లూక్స్, కో చైర్‌పర్సన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రంగోలి, క్రీడలు, పేపర్ ప్రజెంటేషన్, సాంస్కృతిక పోటీలతో ఆకట్టుకున్నారు.

ఆధారాలు చూపని నగదు స్వాధీనం



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సాధారణ తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు చూపకుండా అధిక మొత్తంలో తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ అధికారులు తెలిపిన వివరాలు... జీఆర్పీ, రైల్వే భద్రతా దళం బుధ వారం సాధారణ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తెలంగాణా, నిజామాబాద్ జిలాకు చెందిన ముగ్గురు విశాఖ మీదుగా ఒడిశా రాష్ట్రం, కంటాబంజికు వెళ్తున్నారు. వీరు తమతో ఎలాంటి పత్రాల్లే కుండా రూ.43 లక్షలు తరలిస్తున్నారు. దీన్ని తెలంగాణాలో తమ ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు, వీరి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును మహారాణిపేట మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచినట్లు పేర్కొన్నారు.

యువత భవిష్యత్ నాయకులుగా ఎదగాలి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: యువతలో నాయకత్వాన్ని పెంపొందించడానికి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ఎంతగానో దోహదపడుతుందని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ డే–2025, విశ్వవిద్యాలయ స్థాయి యువజనోత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్ నాయకులుగా, బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ శతాబ్ది వేడుకల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రెండు రోజులుగా విద్యార్థులు కళలు, మేధో పోటీల్లో తమ ప్రతిభను చాటారని తెలిపారు. యువతలో సృజనాత్మకత, సహజ నైపుణ్యాలు వెలికితీసి ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డి.సింహాచలం అప్పటి వరకు జరిగిన కార్యక్రమాల వివరాలను సభకు వివరించారు.

సంగం-శరత్‌లో ఓజీ గోల

- తోపులాటలో ప్రవేశ ద్వారం అద్దాల ధ్వంసం
- ఫ్యాన్స్‌ను అదుపుచెయ్యలేక పోయిన పోలీసులు



సంగం శరత్ థియేటర్‌లో ఫ్యాన్స్ పగుల గొట్టిన అద్దాలు

సీతంపేట: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా బెనిఫిట్ షో సందర్భంగా నగరంలోని సంగం శరత్ థియేటర్ అద్దాలను ఫ్యాన్స్ పగులగొట్టారు. బుధవారం రాత్రి 10 గంటల షో టిక్కెట్ల కోసం సాయంత్రం 6 గంటలకే పవన్ ఫ్యాన్స్ థియేటర్ వద్దకు భారీగా చేరుకున్నారు. అరుపులు, కేకలతో హోరెత్తించారు. ఫ్యాన్స్ భారీగా థియేటర్‌కు చేరుకోవడంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా నియంత్రించేందుకు ఫోర్త్‌టౌన్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఫ్యాన్స్ అల్లరి శృతిమించింది. కేకలు, నినాదాలతో రెచ్చిపోయారు. హాల్లోకి వెళ్లేటపుడు తోపులాట జరగడంతో థియేటర్ ప్రవేశ ద్వారం వద్ద గ్లాస్ డోర్ విరిగిపోయింది. టిక్కెట్లు దొరకని వారు థియేటర్ అద్దాలు పగులగొట్టారు. ఆఖరుకు పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి తోపులాటను నియంత్రించి, టికెట్లున్నవారిని థియేటర్ లోపలకు పంపించారు.

నౌకా నిర్మాణంలో తిరుగులేని శక్తిగా షిప్‌యార్డు

హెచ్ఎస్ఎల్ సీఎండీ గిరిదీప్ సింగ్



వివిధ రంగాల ప్రతినిధులతో సదస్సులో షిప్‌యార్డు సీఎండీ గిరిదీప్ సింగ్

సాక్షి, విశాఖపట్నం: ఆత్మనిర్భర్ భారత్, మారీటైమ్ ఇండియా విజన్–2030 నాటికి భారత్‌లో నౌకా నిర్మాణంలో హిందుస్తాన్ షిప్‌యార్డు(హెచ్‌సీఎల్) తిరుగులేని శక్తిగా ఆవిష్కృతమవుతుందని సంస్థ సీఎండీ గిరిదీప్ సింగ్ అన్నారు. నగరంలో బుధవారం జరిగిన స్వరక్ష మహోత్సవ్–2025 సదస్సులో ఆయన మాట్లాడారు. రక్షణ రంగంలో ఎనిమిది దశాబ్దాలకు పైగా ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్, వాణిజ్య సంస్థలకు సేవలందిస్తున్న షిప్‌యార్డు.. ఇప్పటి వరకూ 200 నౌకల్ని డెలివరీ చేయగా, 2000 కంటే ఎక్కువ షిప్స్‌కు మరమ్మతులు, రీఫిట్ పనులు విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. దశాబ్దాలకు పైగా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పోరాటం సాగించిన తర్వాత.. 2024–25లో అత్యధిక వృద్ధి రేటు, లాభాల్ని నమోదు చేసి.. మినీరత్న హోదాకు అర్హత పొందడం శుభపరిణామమన్నారు. దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ఆర్డర్లని పొందడం ద్వారా షిప్‌యార్డు మరింత అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో ల్యాండ్‌మార్క్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ ప్రొగ్రామ్, అధునాతన జలాంతర్గాముల నిర్మాణాలపై దృష్టి సారించామన్నారు. షిప్‌యార్డు ప్రయాణంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ సంస్థల సహకారం మరువలేనిదని సీఎండీ గిరిదీప్ సింగ్ తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి

ఆరిలోవ: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల్ని సీఎం చంద్రబాబు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు కోరారు. ఈ మేరకు ఏళ్ల తరబడి పరిష్కారం కాని ఉపాధ్యాయ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపించినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ పీఆర్‌సీ ఎరియర్స్ చెల్లించాలని, 12వ పీఆర్‌సీ కమిటీ చైర్మన్‌ను నియమించి, ఐఆర్ తక్షణ ప్రకటన, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వైద్య సౌకర్యం, పెండింగ్‌లో ఉన్న 4 విడతల డీఏ చెల్లింపు తదితర 10 సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

అన్ని రంగాల్లో ఉత్తమంగా జిల్లా



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాను అన్ని రంగాల్లో ఉత్తమంగా నిలిపేందుకు అధికారులు నూతన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. బుధవారం శాఖల వారీగా అధికారులతో జిల్లా అభివృద్ధి, ఆర్థిక పరిపుష్టి, ఆదాయ మార్గాల సాధనకు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. రైతు సేవా కేంద్రాల స్థాయి నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పశుసంవర్ధకంలో డీఆర్డీఏ సహకారంతో కొత్త యూనిట్ల స్థాపన, ఉద్యానవన పంటల విస్తీర్ణం పెంపు, మత్స్య రంగంలో ఉత్పాదకత పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. టూరిస్ట్ డెస్టినేషన్ విశాఖలో పర్యాటకులు రెండు మూడు రోజులు గడిపేలా అడ్వెంచర్ టూరిజం స్పాట్‌లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోసం శిక్షణ ఇవ్వడానికి విశాఖ ఐఐఎం ముందుకొచ్చిందని, స్థానిక ఔత్సాహికులను గుర్తించి శిక్షణ ఇప్పించాలన్నారు. జిల్లాలో 1,05,000 మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, 64 వేల మందిని దత్తత ఇచ్చామని, ఆ కుటుంబాల అవసరాలు తీరేలా చూడాలన్నారు. విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతంలో పక్షులు ఎగరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, వీధిలైట్ల మరమ్మతులు, రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీఎస్టీ 2.0 సంస్కరణ ఫలితాలు ప్రజలకు తెలిసేలా నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

నేడు గంట పాటు శ్రమదానం

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఏక్ దిన్.. ఏక్ ఘంటా.. ఏక్ సాత్ పేరిట అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. డీఆర్వో భవానీ శంకర్, జిల్లా అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయకుంటే పట్టాలు రద్దు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: వచ్చే మార్చి నాటికి గృహ నిర్మాణం పూర్తి చేసుకోకపోతే ఇంటితోపాటు స్థలం పట్టా కూడా రద్దు చేస్తామన్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో పేదల గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, స్పెషల్ అధికారులు, జోనల్ కమిషనర్లు తదితరులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అదనంగా ఇస్తున్న ఆర్థిక సహాయంపై లబ్ధిదారులకు అవగాహన కలిగించాలన్నారు. మార్చి 2026 నాటికి గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు పేదల గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణ లక్ష్యసాధనలో వెనుకబడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వచ్ఛందంగా ఇంటి నిర్మాణానికి ముందుకొచ్చే వారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. ఖాళీగా ఉన్న లేఅవుట్లలో ప్లాట్ల కేటాయింపును లాటరీ పద్ధతిలో పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ సూరిబాబు, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

జైల్‌ను సందర్శించిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్



మహిళా ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న శైలజ

ఆరిలోవ: దేవి నవరాత్రులు సందర్భంగా మహిళలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆమె బుధవారం సందర్శించారు. జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లతో కలిసి మహిళా ఖైదీల బ్యారక్‌ను పరిశీలించారు. అక్కడ మహిళలతో సమావేశమై, పలు అంశాలపై అవగాహన కలిగించారు. వారికి పోషకాహారం అందించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. జైల్లోని బ్యారక్‌లను, ఖైదీలు పనిచేస్తున్న వివిధ పరిశ్రమలను పరిశీలించారు. అనంతరం జైల్ బయటకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నారీ పరివార్ అభియాన్‌లో భాగంగా 'పోషణ్ మా'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జైల్‌లో మహిళా ఖైదీలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. కారాగారంలో 80 మంది మహిళా ఖైదీలున్నారని, వారిలో సుమారు 50 మంది గంజాయి తరలిస్తూ పోలీసులకు దొరికినవారేనని పేర్కొన్నారు. అలాంటి వారిలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు చెన్నై, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందినవారున్నట్లు వెల్లడించారు. మహిళల్లో మంచిమార్పు తీసుకొచ్చి తిరిగి సమాజంలోకి పంపించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు.

అందరికీ అందుబాటులో ప్రజా సేవలు



మాట్లాడుతున్న శాశ్వత ప్రజా న్యాయ పీఠం అధ్యక్షుడు జస్టిస్ జి.వల్లభనాయుడు

విశాఖ లీగల్: ప్రభుత్వం అందించే అన్ని సేవలు ప్రజలకు సత్వరమే చేరేలా చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా శాశ్వత ప్రజా న్యాయ పీఠం అధ్యక్షుడు జస్టిస్ జి.వల్లభనాయుడు సూచించారు. విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాలను ప్రజలందరికీ సత్వరమే చేరేలా పలు సంస్థలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఆర్ సన్యాసినాయుడు, విద్యుత్, టెలికాం, రవాణా, తపాలా, గ్రామీణ ఉపాధి పథకం, గ్రామీణ అభివృద్ధి శాఖ తదితర విభాగాల నుంచి అధికారులు పాల్గొన్నారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సేవలు అందకపోతే వారు న్యాయ సేవా ప్రాధికార సంస్థను ఆశ్రయించవచ్చని న్యాయమూర్తి వల్లభనాయుడు స్పష్టం చేశారు. లోక్ అదాలత్ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రయా ప్రయోజన సేవలన్నీ ప్రజలకు సత్వరమే అందేలా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పోర్టు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా అంగముత్తు



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) చైర్మన్‌గా డా.అంగముత్తుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీపీఏ చైర్మన్‌గా ఉన్న డా.అంగముత్తు ఈ నెల 22న ముంబై పోర్టు చైర్మన్‌గా బదిలీ అయ్యారు. ఆయన బదిలీ అయ్యాక.. కొత్త చైర్మన్‌ని నియమించలేదు. ఈ నేపథ్యంలోనే కొత్త చైర్మన్‌ని నియమించే వరకూ లేదా ఆరు నెలల కాలం వరకూ వీపీఏ చైర్మన్‌గా డా.అంగముత్తుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

వి-జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభిస్తున్న కె.ఎన్.వి.ఎస్.గురుమూర్తి

బీచ్‌రోడ్డు: ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ సమీపంలో వి-జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్‌ను శ్రీకన్య ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎన్.వి.ఎస్.గురుమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వి-జ్యూయలరీ మార్ట్ భాగస్వాములు కోలా బాబురావు, కాకి గంగరాజు, పట్నాల శ్రీనివాసరావు, వూన వినీత్ మాట్లాడుతూ విమార్ట్ ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 క్యారెట్ బంగారు ఆభరణాలను గ్రాము రూ.9,987 చొప్పున తరుగు 6.96 శాతం నుంచి పొందవచ్చన్నారు. అలాగే సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, జీఎస్టీని కస్టమర్ తరుపున తామే చెల్లిస్తామన్నారు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.15,000 వరకు తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే ఉంటుందన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

పాడేరులో ఎస్ఐతో సహా 14 మందికి గాయాలు



జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న పాడేరు ఎస్ఐ గోవిందరావు

సాక్షి,పాడేరు: పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పాడేరు ఎస్ఐతో సహా 14 మందిని గాయపరిచింది. పాడేరు నుంచి చింతలవీధి వెళ్లే ప్రధాన రోడ్డులో స్థానిక వైద్య కళాశాల వద్ద బుధవారం ఉదయం పాడేరు ఎస్ఐ గోవిందరావు, సిబ్బంది వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఇదే సమయంలో అక్కడే సంచరిస్తున్న పిచ్చికుక్క ఒక్కసారిగా ఎస్ఐపై దాడి చేసి గాయపరచడంతో సిబ్బంది భయాందోళన చెందారు.తీవ్రంగా గాయపడిన ఎస్ఐను జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.అలాగే వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు సిబ్బందిపైన పిచ్చికుక్క దాడి చేసింది. అంతేకాకుండా ఈ మార్గంలో నడిచివెళ్తున్న పాదచారులతో పాటు పాడేరు, చింతలవీధి, గబ్బంగి, గుత్తులపుట్టు పంచాయతీల పరిధిలో మొత్తం 14మందిని గాయపరిచింది. ఈ ఘటనలో ఎస్ఐతోపాటు స్థానికులు పాటి సుభద్ర, పి.సుభద్ర, పి.కుమార్, ప్రణీత్, కొర్రా కామేష్, టి.నాగయ్య, కె.మత్స్యరాజు, బోనంగి శరత్‌కుమార్, టి.సత్తిబాబు, కె.చినతల్లి, మత్స్యరాజు, జి.సరోజ, ఎస్, నిర్మలాదేవి, పాంగి కాసులమ్మ, అప్పలమ్మ తదితరులు గాయపడ్డారు.